# మార్పు కోసం - మంచి పాలన కోసం

## సిపిఐ(యం) అసెంబ్లీ ఎన్నికల ప్రణాళిక

సుత్తి, కొడవలి, నక్షత్రం
గుర్తుకే మీ ఓటు

- ★ రాష్ట్ర సమగ్రాభివృద్ధి - వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్రాధాన్యత
- ★ ప్రజా సంక్షేమం - పెన్షన్లు రూ. 5 వేలకు పెంపు
- ★ ప్రత్యేక హోదా సాధన - విభజన హామీల అమలు
- ★ సామాజిక న్యాయం - దళితులకు అండ
- ★ గిరిజన భూముల సంరక్షణ
- ★ రైతు రక్షణ - రుణవిమోచన చట్టం - గిట్టుబాటు ధరల చట్టం
- ★ గ్రామీణ పేదలకు చేయూత
- ★ కనీస వేతనం రూ. 18 వేలు
- ★ ఉద్యోగ భద్రత - ప్రభుత్వ రంగ పరిరక్షణ
- ★ పరిశ్రమలు - ఉపాధి కల్పన - నిరుద్యోగ భృతి రూ. 5 వేలు
- ★ మహిళా సాధికారిత - మద్య నియంత్రణ
- ★ సుపరిపాలన - అవినీతి నిర్మూలన
- ★ అధికార వికేంద్రీకరణ - పంచాయితీలకు పెద్దపీట

**రెండు పార్టీల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టండి**
**ప్రజా హక్కులకై పోరాడే సిపిఐ(యం)ని గెలిపించండి**

# సిపిఐ(యం) ఎన్నికల ప్రణాళిక

# సిపిఐ(యం), సిపిఐ, జనసేన, బిఎస్‌పి అభ్యర్థుల్ని గెలిపించండి!

# రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తోడ్పడండి!!

2014 ఎన్నికల్లో గెలిచి కేంద్రంలో అధికారపీఠం ఎక్కిన బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయి.

తెలుగు ప్రజలకు బిజెపి, కాంగ్రెస్ తీవ్ర ద్రోహం చేశాయి. వాటితో కలిసి తెలుగు దేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నాయి. ఈ మోసాలకూ, ప్రజావ్యతిరేక విధానాలకూ చరమగీతం పాడాలి. ప్రజానుకూల విధానాలతో ముందుకు వస్తున్న సిపిఐ(యం), సిపిఐ, జనసేన, బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బిఎస్‌పి)లను గెలిపించాలి.

రాష్ట్ర విభజన అనంతరం కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తేనే విభజన హామీల అమలుతోపాటు నవ్యాంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి సాధ్యమని నమ్మించి అధికారాన్ని చేపట్టాయి. ఈ నాలుగున్నరేళ్లలో ప్రజల ఆశలు ఫలించ లేదు. రాష్ట్రం కొత్తదైనా విధానాలు మాత్రం పాతవైనందునే మార్పు సాధ్యం కాలేదు. అందుకే నేడు రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం, సామాజిక న్యాయం, ప్రజాసంక్షేమం కోసం, ఉద్యోగ – ఉపాధికోసం పోరాడే సిపిఐ, సిపిఐ(యం)లను వారు మద్దతునిస్తున్న జనసేన, బిఎస్‌పి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నది. నూతన శాసనసభలో వామపక్ష ప్రతినిధులుంటేనే ప్రజల హక్కులకు మద్దతు లభిస్తుంది.

గత నాలుగున్నరేళ్ల కాలంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం విభజన హామీలు నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించింది. ఈ వంచనా వ్యూహంలో తెలుగు దేశం ప్రభుత్వం కూడా భాగస్వామి అయ్యింది. ప్రత్యేక హోదాకు మోడీ ప్రభుత్వం ఎగనామం పెడితే చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని వెనకేసుకు వచ్చారు. ప్రత్యేక హోదా స్థానంలో ప్రత్యేక ప్యాకేజీ ఇస్తుందని రాష్ట్ర ప్రజలను మభ్యపుచ్చారు. వామపక్షాలు, జనసేన, ఇతర ప్రజాతంత్ర శక్తులు విభజన హామీలు నెరవేర్చాలనీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి తీరాలనీ పోరాడుతుతుంటే లాఠీ ఛార్జీలు చేయించారు. జైళ్లలో పెట్టారు. విద్రోహి బిజేపీ, నయవంచక తెలుగుదేశం పార్టీలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీన్ని గమనించిన తెలుగుదేశం రాత్రికి రాత్రి బోర్డు తిప్పి బిజేపీకి వ్యతిరేకంగా హోదా కోసం పోరాడుతున్నట్లు సరికొత్త నాటకం మొదలు పెట్టింది. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం తీవ్ర ద్రోహం చేస్తుంటే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బిజెపితో స్నేహం చేస్తోంది. ఆ పార్టీ అభ్యర్థిని రాష్ట్ర పతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నేరుగా బలపరిచింది. రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో పరోక్షంగా సహకరించింది. అవిశ్వాస తీర్మానం ఇచ్చి చర్చకు వచ్చే సరికి పార్లమెంటు సభ్యత్వాలకు రాజీనామా చేసి చర్చనుండి నిష్క్రమించారు. బిజెపితో దోస్తీకి ఇబ్బంది లేకుండా జాగ్రత్త పడ్డారు. విద్రోహి బిజేపీపై ఒక్క విమర్శ చేయడం లేదు. పైగా వారిపై ఈడ వాలనీయడం లేదు. అందుకే రాష్ట్రాన్ని విభజించి, విభజన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు అన్యాయం చేసిన బిజెపి, కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలను, వాటి బాటలోనే పోతున్న వైఎస్ఆర్‌సిపిని ప్రజలు వ్యతిరేకించాలి. విభజన హామీల అమలు కోసం నికరంగా పోరాడుతున్న వామపక్షాలు, జనసేన, బిఎస్‌పిలకు మద్దతివ్వడం ద్వారా మాత్రమే కేంద్రాన్ని దారికి తేగలం.

### మోడీ ముదనష్టపు పాలన

ఐదేండ్ల మోడీ పాలనలో వ్యవసాయ సంక్షోభం ముదిరి రైతాంగం దివాళా తీసింది. యువతకు ఉపాధి లేదు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని మభ్య పెట్టి ఆఖరికి తుస్సు మనిపించారు. ఉద్యోగాలడిగిన యువతను

పకోడీలను అమ్ముకోమని ఎకసెక్కాలాడారు. కార్మిక వర్గ హక్కులపై తీవ్రదాడికి పాల్పడ్డారు. విదేశాల్లోని నల్లడబ్బును దేశానికి తీసుకువస్తానని గద్దెనెక్కిన మోడీ నల్లడబ్బు తేకపోగా విజయ్ మాల్యా, నీరవ్ మోడీ వంటి కార్పొరేట్‌లు బ్యాంకులకు వేలు కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోవడానికి సహకరించారు. నీతికి మారు పేరని గద్దెనెక్కి నాలుగేళ్లు కూడా తిరక్కుండానే వేల కోట్ల రాఫెల్ కుంభకోణంలో ఇరుక్కుపోయింది మోడీ ప్రభుత్వం. మోడీ పాలనలో ఉగ్రవాదం జడలు విప్పి నాట్యం చేస్తోంది. దేశ భద్రతను ఫణంగా పెట్టి కీలకమైన రక్షణ, ఫైనాన్స్ రంగాలను కూడా ప్రయివేటు పరం చేస్తున్నారు. నోట్ల రద్దు, జిఎస్‌టిల వల్ల అసంఘటిత రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిని ప్రజల ఉపాధి హరించుకుపోయింది.

మోడీ అధికారంలోకి వచ్చాక దళితులు, మహిళలు, మైనారిటీలపైనా, దేశంలోని లౌకిక వ్యవస్థలపైనా దాడులు పెరిగాయి. ప్రజల అసంతృప్తిని దారిమళ్లించేందుకు మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రగిల్చారు. గోరక్షణ, లౌ జిహాద్ పేరుతో మైనారిటీలపైనా, దళితులపైనా దాడులు జరిగాయి. రాష్ట్రపతి, గవర్నర్ల నుండి విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ల వరకు న్యాయ, రక్షణ రంగానుండి విద్యా, వైద్య వ్యవస్థల వరకు అన్నింటినీ ఆర్ఎస్ఎస్ వ్యక్తులతో నింపేస్తున్నది. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులే సైన్సుపై దాడి చేశారు. హేతువాదులు, అభ్యుదయ వాదులను మతోన్మాద శక్తులు పట్టపగలు హత్యలు గావించారు. పలువురు బిజెపి ప్రజా ప్రతినిధులు అత్యాచారాల కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారు. దేశంలోని అన్ని ప్రజాస్వామిక వ్యవస్థలను మోడీ ప్రభుత్వం నాశనం చేస్తున్న క్రమం మన కళ్లముందు కనబడుతోంది.

మోడీ ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తోంది. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ నిధుల ప్రవాహానికి ఎలక్టోరల్ బాండ్ల చట్టం చేసింది. జమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల శాసన సభలను నిర్ణీత కాలంలో ఎన్నుకునే ప్రజల హక్కులను హరించ పూనుకుంటుంది. విశ్వ విద్యాలయాల్లో భిన్నాభిప్రాయాల నోరు నొక్కేస్తున్నది. విద్యార్థి సంఘాలను అణచివేయడానికి ప్రయత్నిస్తోంది.

మన స్వతంత్ర విదేశాంగ విధానానికి తూట్లు పొడిచి అమెరికా పెత్తనానికి తలవొగ్గుతోంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం భారత దేశాన్ని అమెరికా యుద్ధ వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా మార్చే విధానాలు చేపట్టగా, ఎన్డీఏ ప్రభుత్వం మరింత ముందుకు వెళ్లి అమెరికా యుద్ధ నౌకలకు, విమానాలకు మన దేశంలో ఆశ్రయం కల్పించే ఒప్పందం చేసుకుంది. మన రక్షణ రంగంలోకి అమెరికా ఏజెంట్లు నేరుగా ప్రవేశిస్తున్నారు.

## తెలుగు దేశం ప్రజావ్యతిరేక పాలన

తెలుగు దేశం, బిజెపి కూటమిని గెలిపిస్తే కేంద్రం నుండి రాష్ట్రానికి భారీగా నిధులు వస్తాయని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గత ఎన్నికల్లో నమ్మించారు. లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రచారం చేశారు. నాలుగేళ్లపాటు రాష్ట్రంలోని తెలుగు దేశం ప్రభుత్వంలో బిజెపి భాగస్వామిగా ఉంది. కానీ ఈ కాలంలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు లేవు, పరిశ్రమలు లేవు. రాష్ట్రాభివృద్ధి పేరుతో ముఖ్యమంత్రి విదేశీ పెట్టుబడుల కోసం ఆరాట పడుతుంటే మరోవైపు రాష్ట్రంలోని సంపదపరులంతా లాభాల కోసం వారి పెట్టుబడులను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**<u>ఉద్యోగం - ఉపాధి:-</u>** బాబు వస్తే జాబు వస్తుందని ప్రజలను ఎన్నికల ముందు ఊరించారు. నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. కానీ బాబు అధికారంలోకి వచ్చాక కొత్త ఉద్యోగాలు రాకపోగా అనేక చిన్నా పెద్ద పరిశ్రమలు మూతపడి లక్షల మంది నిరుద్యోగులైనారు. ఫెర్రో ఎల్లాయిస్, జనపనార, చక్కెర వగైరా అనేక సంప్రదాయ పరిశ్రమలు మూతపడ్డాయి. బాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ డైరీ పుంజుకుంది కానీ సహకార రంగంలోని చిత్తూరు డైరీ మూతపడింది. ప్రకాశం డైరీ సంక్షోభంలో పడింది.

బాబు అధికారం చేపట్టినప్పటినుండి రాష్ట్రంలోకి పెట్టుబడుల వరద వస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలతో భాగస్వామ్య సదస్సులు నిర్వహిస్తూ లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నట్లు పత్రికల్లో ప్రకటనలు ఇస్తున్నారు. పెట్టుబడులు రాలేదు. ఉద్యోగాలు ఇవ్వలేదు. వచ్చిన కొద్దిపాటి పరిశ్రమలు కూడా అత్యధిక కాలుష్య కారకాలైన పరిశ్రమల్లోకి వస్తున్నాయి. వాటివల్ల జనావాసాలు విషపూరితమై ప్రజల ఆరోగ్యాలు, పర్యావరణం దెబ్బ తింటున్నాయి.

ప్రభుత్వ ఉద్యోగాల్లో 2 లక్షలకు పైగా ఖాళీలున్నాయి. బ్యాక్ లాగ్ పోస్టులను నింపలేదు. చేస్తున్న నియామకాలను కూడా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతికి మార్చారు. కనీస వేతనం అమలు పరచడం లేదు. పని భద్రత ఉండడం లేదు. సమానపనికి సమాన వేతనం అనే సహజన్యాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా ఉల్లంఘిస్తోంది. అంగన్‌వాడీలు, ఆశాలు వంటి వారితో వెట్టి చాకిరీ చేయించుకుని నామమాత్రపు వేతనాలు ఇస్తున్నారు.

**రైతు వ్యతిరేక చర్యలు:-** కార్పొరేట్‌లకు పందేరం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం రైతుల భూములను, దళితుల అసైన్డ్ భూములను బలవంతంగా గుంజుకుంటోంది. దీనికోసం 2013 భూసేకరణ చట్టాన్ని సవరించింది. కార్పొరేట్ కంపెనీలకు లక్షల ఎకరాలు ఇచ్చేస్తున్న బాబు ప్రభుత్వం పేదల ఇళ్ళ స్థలాలకు మాత్రం ఒక్క ఎకరా కూడా కేటాయించడం లేదు. కరువు ప్రాంతాలకు, వెనుకబడ్డ ప్రాంతాలకు సాగునీరు, త్రాగునీరు అందించే సమగ్ర విధానమూ లేదు. రాష్ట్రంలో నికర సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. వ్యవసాయపంటల ధరలు పడిపోతున్నాయి. రుణ భారం పెరిగి రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. కూలీలు, వృత్తిదారులు ఉపాధిలేక వలసబాట పట్టారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.

**ఆదివాసీలకు అన్యాయం :-** బాక్సైట్ త్రవ్వకాలకు జి.వో.97 ఇచ్చి చంద్రబాబు ఆదివాసీలను మరోసారి మోసం చేశారు. విద్య, వైద్యం రెండింటినీ నిర్వీర్యం చేసి ఆదివాసీల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు. అటవీ హక్కుల చట్టం అమలు చేయడం లేదు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ఆదివాసీలకు ద్రోహం చేస్తున్నారు. చట్టబద్ధమైన ట్రైబల్ అడ్వయిజరీ కమిటీని నియమించలేదు. మూడేళ్ళపాటు ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులను తన ఇష్టమొచ్చినట్లు దారి మళ్ళిస్తున్నారు. ఏజెన్సీ ఆసుపత్రుల్లో మందులు, డాక్టర్లు, సిబ్బంది కరువు.

**దళితులపై దాడులు పెరిగాయి:-** ఈ కాలంలో ఆధిపత్య కుల దురహంకారం పెరిగింది. దళిత, ఆదివాసీ, మహిళలపై పెరిగిన దాడులు, బలహీనవర్గాలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైంది. మహిళలపై అత్యాచారాల్లో రాష్ట్రం దేశంలోనే ముందంజకు చేరుకుంది. మహిళా సాధికారత మాటలకే పరిమితం అయింది. మద్యం ఏరులై పారుతోంది. పేదల కొంపలు కొల్లేరు అవుతున్నా ఖజానా నింపుకోడానికే ప్రభుత్వం తాపత్రయ పడుతోంది.

**వెనుకబడిన ప్రాంతాలపై నిర్లక్ష్యం:-** ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ నగరం చుట్టూ అభివృద్ధి కేంద్రీకరించబడింది. పరిశ్రమలు, ఆధునిక ప్రాజెక్టులన్నింటినీ ఒకేచోట కేంద్రీకరించినందున రాష్ట్రం తీవ్ర అసమానతలకు లోనయింది. వెనుకబడిన ప్రాంతాలు, వర్గాలు, తరగతులు నిర్లక్ష్యానికి గురయ్యాయి.

ఆ అనుభవం తరువాత కూడా చంద్రబాబు ప్రభుత్వం గుణపాఠాలు నేర్వలేదు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలోని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లోని వెనుకబడిన ప్రాంతాలపట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించింది. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ పెండింగులో ఉన్న ప్రాజెక్టులలో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. అనంతపురంలో కరువు విలయతాండవం చేస్తున్నది.

వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు ఈ కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. జంఝావతి ప్రోజెక్టు 40 ఏళ్ళు దాటినా పూర్తి కాలేదు. 2003లో ప్రారంభమైన తోటపల్లి, తారకరామా, వంశధార, ఫేజ్-2, ఆఫ్-షోర్ ప్రాజెక్టులు నేటికీ పూర్తికాలేదు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి త్రాగునీరిచ్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి 2009లో శంకుస్థాపన చేసినా ఇంత వరకు ఒక్క రూపాయీ ఖర్చు పెట్టలేదు.

2016 నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, రామాయపట్నం పోర్టు, దొనకొండ పారిశ్రామిక కారిడార్ వంటి హామీలు గాలిలో కలిసిపోయాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి వెలుగొండ ప్రాజెక్టులో 11.5 కి.మీటర్ల టన్నెల్ త్రవ్వగా, ఈ నాలుగేళ్ళలో 2.5 కి.మీ.కూడా పూర్తి చేయకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్ట. జిల్లాలో పెండింగ్‌లోవున్న 6 నీటిప్రాజెక్టులలో ఒక్కటి కూడా పూర్తికాలేదు.

**విద్య, వైద్యం:-** విద్యా, వైద్యంలో మానవాభివృద్ధి సూచికలలో రాష్ట్రం చాలా వెనకబడింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలందరికీ విద్య, వైద్యం అందే విధానాలు చేపట్టాల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా కార్పొరేట్ల లాభాలకు దాసోహమైంది. సామాన్యులపై భారాల్ని పెంచుతోంది. రేషనలైజేషన్ పేరుతో వేలాది పాఠశాలలు మూసేసింది. ఉన్నత విద్య బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకున్నది. ప్రభుత్వ వైద్యశాలల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేదలకు ఆరోగ్య భద్రత లేకుండా పోయింది.

**అవినీతి:-** అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం అవినీతిలో నిండా కూరుకుపోయాయి. ప్రభుత్వంలో ఏ పని కావాలన్నా లంచాలు లేనిదే జరగడం లేదు. ఇసుక, మైనింగు, నీరు, భూమి, అడవులు లాంటి ప్రకృతి వనరులను అక్రమ మార్గాల్లో కొల్లగొట్టుతున్నారు. ప్రతిపక్ష ఎంఎల్ఎలను డబ్బు, అధికార పదవుల ఎరచూపి కొనుగోలు చేసే దుష్ట సంస్కృతిని తెలుగు దేశం ప్రభుత్వం మరింతగా పెంచి పోషించింది. జన్మభూమి కమిటీలు అవినీతికి ఆలవాలంగా మారాయి.

**నిరంకుశ పోకడలు:-** ప్రజా ఉద్యమాలను చంద్రబాబు ప్రభుత్వం అణచివేస్తున్నది. ప్రతిపక్ష పార్టీల పట్ల, ఉద్యమాల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోంది. 144 సెక్షన్, పోలీసు యాక్ట్ 30ని నిరంతరం ప్రయోగిస్తున్నది. ముందస్తు అరెస్టులు,

అక్రమ కేసులు, గృహ నిర్బంధాలు మితిమీరాయి. జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్లో ఎన్నికైన ప్రజా ప్రతినిధులను పక్కనబెట్ట తెలుగు దేశం నాయకులు పెత్తనం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరపకుండా వాయిదా వేసింది.

**స్థానిక సంస్థలు:–** స్థానిక సంస్థలకు 73వ రాజ్యాంగ సవరణకు విరుద్దంగా పంచాయితీలను ప్రత్యేక అధికారులతో నడుపుతున్నారు. ఎన్నికలు నిర్వహించకుండా వాయిదా వేశారు. ఎంఎల్ఎలు, జన్మభూమి కమిటీల పెత్తన్నాన్ని వాటిపై రుద్దుతోంది.

## ఎన్నికల ముందు ఫీట్లు

అన్ని రంగాల్లో విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ప్రజలను మభ్య పుచ్చేందుకు అనేక ఫీట్లు చేస్తున్నది. పెన్షన్లు పెంపుదల, అన్నదాతా సుఖీభవ, నిరుద్యోగ భృతి, అన్న క్యాంటీన్లు, ఇళ్ల నిర్మాణం, బలహీనవర్గాలకు రుణాలు అంటూ మరోసారి మోసం చేయడానికి సిద్దపడుతున్నారు. భవన నిర్మాణ కార్మికుల రక్షణ నిధినుండి వందల కోట్ల రూపాయలు చంద్రన్న భీమా ప్రభుత్వ ప్రచారం కోసం ఉపయోగించుకుంటున్నారు. విద్యార్థుల నుండి వసూలు చేస్తున్న ఫీజులతో యూనివర్శిటీలలో రాజకీయ ప్రచారం చేసుకుంటున్నది. రాజధాని, పోలవరం నిర్మాణాలపై ఆర్భాటం చేస్తున్నారు. ఇంతకాలం అణచివేసిన అంగన్‌వాడీ, ఆశా, విఆర్ఏలకు జీతాలు పెంచి సన్మానాలు చేయించుకుంటున్నారు. రాయలసీమను రాజధానితో కలిపే రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలు, మెట్రోలు అన్నీ కాగితాలమీదనే ఉన్నాయి. అయినా తాను ఏదో చేస్తున్నట్లు కోట్ల రూపాయలతో పెద్ద ఎత్తున ప్రచారార్భాటం నిర్వహిస్తున్నారు. ఈ నాలుగేళ్ళలో ఒక్క అభివృద్ధి కార్యక్రమమూ జరగలేదు. ఉద్యోగాలు అంతకన్నా లేవు.

## విఫలమైన వైసీపి

పాలకపక్షం విధానాలను ఎదిరించి ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సిపి రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపిని బలపర్చడానికి పోటీపడింది. బిజేపీ, దాని మూల విరాట్టు ఆర్‌యస్‌యస్ దాని అనుబంధ సంఘాలు నిత్యం దళితులపై, ఆదివాసీలపై, మైనారిటీలపై ఉన్మాదపూరితంగా దాడులు చేస్తున్నా స్పందించడం లేదు. 2013 భూసేకరణ చట్టానికి, కార్మికుల చట్టాలకు చేసిన సవరణలను అడ్డుకోలేదు. భూములు కోల్పోయిన రైతులు, దళితుల, ఆదివాసీల రక్షణకు ముందుకు రావడం లేదు. మహిళల హక్కుల విషయంలో కూడా ఇదే వైఖరి. అసెంబ్లీని బహిష్కరించడం ద్వారా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఘోరంగా విఫలమైంది. నవరత్నాల పేరుతో విద్యా, వైద్యంలో ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడానికే పూనుకుంటున్నది. మౌలిక విధానాలలో వైఎస్సార్‌సిపికి, టిడిపికి తేడా లేదు. ప్రధాన ప్రతిపక్షంగా సంపూర్ణంగా విఫలమైన వైయస్సార్ కాంగ్రెసు పార్టీకి ఓట్లేయడమంటే రాష్ట్రాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టడమే. రాష్ట్రం అరాచకం పాలవుతుంది. అవినీతికి అడ్డాగా మారుతుంది. ఈ పార్టీని పూర్తిగా తిరస్కరించాలి.

## అసెంబ్లీలో వామపక్షాలుంటేనే ప్రజలకు అండ

అందుకనే ప్రజలకు అండగా నిలిచి, అభ్యుదయ, ప్రజానుకూల, లౌకిక విధానాలతో ప్రజలకు ఊరట కలిగించగలిగే శక్తులు బలపడాలి. వికేంద్రీకరణ విధానాలు కావాలి.

అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పోరాడుతూ అనేక హక్కుల్ని సాధించేందుకు కారణం వామపక్షాలే. వామపక్ష ఉద్యమాలే లేకుంటే ఈ రోజు పేదలు, కష్టజీవులు, రైతులు, కార్మికులు, మహిళలు, దళితులు, గిరిజనుల పరిస్థితి ఇంకా దారుణాతిదారుణంగా ఉండేది. ఈ పార్టీలు అసెంబ్లీలో ఉంటే ఇంకా సమర్దవంతంగా ప్రజల కోసం పోరాడుతాయి. వైయస్సార్ కాంగ్రెసు లాగా బాధ్యతల నుండి పారిపోవు. అధికారపార్టీలాగా అవినీతికి పాల్పడవు. నీతికి. నిజాయితీకి, నిస్వార్దసేవకు మారుపేరుగా నిలబడతాయి.

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రగతిశీల ప్రత్యామ్నాయానికి ఓట్లు వేయడం ద్వారా మన నియోజక వర్గం అభివృద్ధికి నడుం బిగిద్దాం. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ పాలనలో మార్పుకు నాంది పలుకుదాం. మన నియోజకవర్గ అభివృద్ధికి సమగ్రమైన, ప్రజానుకూలమైన ప్రణాళికతో ముందుకొస్తున్న సిపిఐ(యం), సిపిఐ, జనసేన పార్టీలకు ఓట్లేసి గెలిపిద్దాం.

## రాష్ట్ర సమగ్రాభివృద్ధి ప్రణాళిక

**రాష్ట్ర** సమగ్రాభివృద్ధి, సామాజికన్యాయం, ఉద్యోగ – ఉపాధి, ప్రజా సంక్షేమం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, వికేంద్రీకరణ వామపక్షాల లక్ష్యం.

## రాష్ట్ర సమగ్రాభివృద్ధి – వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత

సమగ్రాభివృద్ధి అంటే అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి కావడం. రాజధాని పేరుతో అభివృద్ధినంతా ఒకే చోట కేంద్రీకరించే పద్ధతి వల్ల గత అనుభవాలే పునరావృతమవుతాయి. ప్రాంతీయ అసమానతలు తీవ్రతరమవుతాయి. ప్రజల మధ్య ప్రాంతాలు, ప్రాంతాల మధ్య ద్వేషాలు పెరుగుతాయి.

పట్టణాలు, గ్రామాల మధ్య అసమానతలు తగ్గాలి. ప్రాంతాలకు ప్రాంతాలకు మధ్య, అన్ని గ్రామాల్లోనూ కనీస వసతులు ఏర్పడాలి. సమగ్రాభివృద్ధి చెందాలి. మండలం యూనిట్‌గా అసమానతలను రూపు మాపాలి. ఇందుకోసం

**1. ప్రత్యేకహోదా – విభజన హామీల అమలు :** రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలి. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయడం. విభజన చట్టంలోని ఇతర హామీల అమలు, రాజధాని నిర్మాణానికి, బడ్జెట్ లోటు పూడ్చుకోడానికి కేంద్రం నుండి నిధుల సాధన–విశాఖ రైల్వే జోన్, కడపలో ప్రభుత్వ ఉక్కు ఫ్యాక్టరీ స్థాపన, సెంట్రల్ యూనివర్శిటీ, గిరిజన యూనివర్శిటీ వగైరా సాధన. పోలవరం నిర్వాసితులకు సంపూర్ణ పునరావాసం కల్పించి ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయడం.

**2. ప్రాజెక్టులు**: సాగునీటి ప్రాజెక్టులను ముఖ్యంగా కరువు ప్రాంత ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడం.

విశాఖ ఉక్కుకు స్వంత గనుల కేటాయింపు, కె.జి.బేసిన్ గ్యాస్‌లో రాష్ట్రానికి వాటా సాధించుకుని దాన్ని విద్యుత్ ఉత్పత్తికి, ఎరువుల ఉత్పత్తికి కేటాయించడం. డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను ప్రయివేటీకరణను వ్యతిరేకించడం.

జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర కర్మాగారాలు, స్పిన్నింగు మిల్లులు ఇతర మూతబడ్డ పరిశ్రమలను తెరిపించడం–ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం.

**3. శ్రమకు తగ్గ ఫలితం:** శ్రమచేసి దేశానికి సంపద పెంచుతున్న రైతులు, కూలీలు, కార్మికుల పరిస్థితి రోజు రోజుకూ దిగజారిపోతున్నది. వారి కష్ట ఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. దేశం అభివృద్ధి చెందుతుంది.

**4. వ్యవసాయ రంగ పరిరక్షణ – రైతులు, కూలీల సంక్షేమం :** రైతులకు కనీస మద్ధతు ధర గ్యారెంటీ చట్టం–రైతు రక్షణ నిధి ఏర్పాటు, రుణ మాఫీ, ప్రైవేటు రుణ నియంత్రణచట్టం. బ్యాంకుల ద్వారా వడ్డీలేని పంట రుణం.

కౌలు రైతులందరికీ కార్డులు, హామీ లేకుండా రుణాలు, ఇన్సూరెన్సు. 50 ఏళ్ళు దాటిన పేద రైతులకు పెన్షన్.

స్వామినాథన్, జయతీఘోష్, కోనేరు రంగారావు కమిటీల సిఫార్సులను అమలు చేయుట.

**5. కార్మిక హక్కులు :** నెలకు రూ.18,000 కనీస వేతనం, కార్మిక హక్కులను దెబ్బదీసే చట్టాల రద్దు, కార్మిక చట్టాల అమలు యంత్రాంగం బలోపేతం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, గౌరవ వేతన కార్మికులకు ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్. అందరికీ ఇఎస్ఐ, పిఎఫ్ అమలు, స్కీంవర్కర్లను ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించి వేతనాలు పెంచడం; ప్రభుత్వ రంగ పరిరక్షణ, వలస కార్మికులకురక్షణ.

**6. సిపియస్ రద్దు :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి మరణశాసనంగా మారింది. రిటైర్మెంట్ తర్వాత జీవితం గాలిలో దీపంలా మారుతుంది. దానికి వ్యతిరేకంగా ఉద్యోగులు పెద్దఎత్తున పోరాడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 2014 ఎన్నికల్లో పాత విధానాన్ని పునరుద్దరిస్తానని వాగ్దానం చేసి అమలు చేయకుండా దారుణంగా మోసం చేసింది. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించడం వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల వల్లే సాధ్యమవుతుంది. సిపియస్‌ను రద్దు చేయాలి.

**7. సంక్షేమ కార్యక్రమాల అమలు :** అర్హులైన అన్ని రకాల పెన్షన్ దారులకు నెలకు రు.5000 పెన్షన్– ప్రతి కుటుంబానికి రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, అందరికీ రేషన్ కార్డులు, ఆహార భద్రత చట్టం అమలు.

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు వేసుకున్న పేదలకు క్రమబద్ధీకరణ – హక్కుల కల్పన. పేదలందరికీ ఉచితంగా స్థలాలు – పక్కా ఇళ్ళు.

**8. భూమి కావాలి :** భూమి లేని నిరుపేదలకు కుటుంబానికి ఉచితంగా మూడు ఎకరాల భూమి.

వ్యవసాయ కార్మికులకు సంవత్సరం పొడవునా పనులు, కనీస వేతనం అమలు–పేదలకు ఉచిత విద్యుత్, ప్రతి ఇంటికీ టాయిలెట్, మంచినీరు, గ్యాస్ సరఫరా.

**9. నిర్వాసితులకు సంపూర్ణ పునరావాసం :** ఐదేళ్ళు దాటినా ఫ్యాక్టరీలు పెట్టని భూములను వెనక్కు తీసుకుని పేదలకు

ఇవ్వడం. రైతులు, గ్రామీణ ప్రజలను భూములు ఖాళీ చేయించి బలవంతంగా పంపరాదు. సంపూర్ణ పునరావాసం పూర్తయ్యాకే అభివృద్ధి పనులకు కేటాయించడం.

భూసేకరణ – పునరావాస చట్టం 2013 పక్కాగా అమలు – 2018 సవరణల ఉపసంహరణ.

**10. సామాజిక న్యాయం :** సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగుబలహీనవర్గాలు ఇతర సామాజిక తరగతులతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్షత అంతం చేయడం, కులాంతర వివాహాలు చేసుకునే వారికి ప్రోత్సాహం. కులాంతర వివాహం చేసుకొన్న జంటలకు రక్షణ కల్పించి బతకడానికి భరోసా ఇవ్వడం. అణగారిన కులాలపై దాడులకు తెగబడే ఆధిపత్య కుల దురంహకారాన్ని కట్టడి చేయడం.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత – ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ– ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్ల అమలు–ఎస్సీ కార్పోరేషన్ ద్వారా యువతకు రుణాలు–పున్నయ్య కమీషన్ సిఫార్సుల అమలుకు గ్యారెంటీ–దళిత పేటలకు స్మశాన భూముల కేటాయింపు–అసైన్డ్ భూములకు రక్షణ–దళితులపై దాడులకు పాల్పడ్డవారిపై కఠినచర్యలు–ప్రతి జిల్లాలో ప్రత్యేక న్యాయస్థానం. – మ్యానువల్ స్కావెంజింగ్ నిషేధం – ఆధునిక పరికరాల కల్పన.

**11. గిరిజన సంక్షేమం :** అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి గిరిజనులకు అటవీ భూమిపై హక్కు కల్పించడం.

గిరిజన జిల్లా రాజ్యాంగంలో 6వ షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు, నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చడం, పునరావాస గ్రామాలకు 5వ షెడ్యూల్ అమలు, గిరిజన యూనివర్శిటీ, బాక్సైట్ త్రవ్వకాల జి.వో.97 రద్దు. జిసిఐ రక్షణ – జి.వో.03 ప్రకారం అమలు. మైదాన ప్రాంత గిరిజనులకు ఏజెన్సీ ప్రాంత గిరిజనులతో సమానంగా హక్కులు, పథకాలు వర్తింజేయాలి.

**12. చేతి వృత్తులకు రక్షణ :** వృత్తిదారులకు ప్రత్యేక నిధులు. సహకార సంఘాల ద్వారా కష్టపడి వృత్తి చేసుకునే కుటుంబాలకు సహాయం. ప్రజాస్వామిక పద్ధతిలో ఎన్నికలు జరిపి వారి సంఘాలకు అధికారాలు కల్పించడం.

చేతి వృత్తులకు రక్షణ చర్యలు–50 ఏళ్లు దాటిన చేతివృత్తిదారులకు పెన్షను–వృత్తుల ఆధునీకీకరణకు సబ్సిడీ రుణాలు – బిసీలకు సబ్‌ప్లాన్. కల్లుగీత, గొర్రెల, మేకల పెంపకం దార్ల సొసైటీలకు 5 ఎకరాల భూమి. మత్స్యకార్లకు, రజకులకు చెరువులు రిజర్వు, సముద్ర ప్రాంత మత్స్యకారులకు ఉపాధి, డీజిల్ సబ్సిడీ, వేట నిషేధ భృతి, రజక దోభీఘాట్ల నిర్మాణం, చేనేత, గీత, రజక, క్షౌర, వడ్డెర తదితర వృత్తిదార్లకు రక్షణ చట్టం. వృత్తిదార్ల పిల్లల విద్యకు ఆశ్రమ పాఠశాలలు, సంచార జాతుల అభివృద్ధికి ప్రత్యేకకృషి.

**13. సమాన హక్కులు :** కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు రెండు లక్షలు–పుట్టిన ప్రతి బాలికకూ లక్ష డిపాజిట్. ట్రాన్స్ జెండర్‌లకు ఉపాధి, పెన్షన్, స్త్రీ, పురుషులతో సమాన గౌరవం. పట్టణాల్లో అనాధ బాలలు, వృద్ధులు, మహిళలకు పునరావాసం.

**14. ధరల నియంత్రణ :** పేదలందరికీ సబ్సిడీపై చవకగా ఆహారం, వసతి. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం. జీవితావసర కనీస సరుకుల్ని చౌక ధరలకు అందించడం.

పెట్రో ధరలపై పన్ను తగ్గించి తక్కువ ధరకు అమ్మకం.

**15. యువతకు ఉపాధి :** ప్రభుత్వ ఉద్యోగాలలో ఖాళీల భర్తీ, పక్కాగా రోస్టర్ అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు.

నెలకు రూ.5000/–లు నిరుద్యోగ భృతి.

ఐటి వంటి ఆధునిక పరిశ్రమల విస్తరణకు కృషి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాష్ట్రం ముందంజ వేయడానికి ప్రత్యేక ప్రణాళిక–శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం.

**16. ప్రభుత్వరంగంలో విద్య, అధిక నిధులు :** విద్యాహక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయడం – అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య. కార్పొరేట్ విద్యా సంస్థల నియంత్రణ, ఫీజుల నియంత్రణ, ప్రయివేటు టీచర్లకు కనీస వేతనాలు.

ప్రభుత్వ విద్యకు 25% బడ్జెట్, ప్రభుత్వ యూనివర్శిటీలకు నిధులు – స్వయం ప్రతిపత్తి, ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు.

మాతృభాషలో విద్యా బోధన, తెలుగుభాష పరిరక్షణ, ప్రాచీన భాషగా గుర్తింపుకు చర్యలు. ఇంగ్లీషు మీడియంతో సహా ఏభాషనైనా ఐచ్ఛికంగా ఎంపిక చేసుకొనే అవకాశం.

**17. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం:** కార్పొరేట్ వైద్య సంస్థల నియంత్రణ, ప్రభుత్వ వైద్య సంస్థల సేవలను మెరుగుపర్చడానికి ప్రత్యేక బడ్జెట్.

అంటువ్యాధుల నిర్మూలన, పేదలకు మెరుగైన ఉచిత వైద్యం, ఆదివాసీ, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక సౌకర్యాలతో కూడిన ఆసుపత్రుల నిర్మాణం.

**18. అందరికీ ఉచితంగా మంచినీరు ఒక హక్కు :** ప్రతి ఇంటికీ ఉచితంగా రక్షిత త్రాగునీరు – మంచినీటి వ్యాపారంపై నియంత్రణ – భూగర్భ జలాల సంరక్షణ – నీటి కుంటలపైప్రజలకుహక్కు

**19. విభిన్న ప్రతిభావంతులు :** వికలాంగులకు ప్రత్యేక చట్టం. వారి నెల వారీ భృతి పెంచడం. గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించడం.

**20. మహిళా హక్కులు :** మహిళల రక్షణకు ప్రత్యేక యంత్రాంగం – అత్యాచారాల కేసుల్లో సత్వర విచారణ, వెనువెంటనే శిక్షల అమలు, మహిళా సాధికారత.

డ్వాక్రా గ్రూపులకు, సభ్యులకు ప్రత్యేక ప్రోత్సాహ పథకాలు, రుణాలు, వడ్డీమాఫీ అమలు

చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు.

మద్య నియంత్రణ, మున్సిపల్ వార్డు/ పంచాయతీ ఆమోదిస్తేనే అనుమతి.

**21. బాలల హక్కులు :** బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం – విధులు – నిధులు. అనాధ బాలలకు ప్రత్యేక రక్షణ.

**22. మైనారిటీలకు రక్షణ :** మైనారిటీలకు రక్షణ, మతసామరస్యాన్ని కాపాడటం, సంక్షేమకార్యక్రమాలు, రిజర్వేషన్ల అమలు.

దళిత క్రిష్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చడం.

సచార్ కమిటీ సిఫార్సుల అమలు – వక్ఫ్ భూములకు రక్షణ – ఉర్దూ టీచర్ పోస్టుల భర్తీ.

**23. వికేంద్రీకరణ :** వికేంద్రీకరణ అంటే పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెంచడం. స్థానిక సంస్థలకు అధికారాలు పెంచడం–ప్రణాళికా నిధుల్లో సగం స్థానిక సంస్థలకు కేటాయించడం. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడం, వెనుకబడిన ప్రాంతాలకు, వర్గాలకు, తరగతులకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యత నివ్వడం.

**24. అవినీతి నిర్మూలన – సుపరిపాలన :** వినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు, విధులు

– అభివృద్ధి వికేంద్రీకరణ ప్రణాళికలు.

– రాజకీయ అవినీతి అంతం – ఎన్నికల్లో డబ్బు పంపిణీ అరికట్టడం.

– నియమిత కాలంలో పౌరుల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం.

**25. ఎన్నికల సంస్కరణలు :** నేటి ఎన్నికల వ్యవస్థ వ్యాపారంగా మారింది. రాజకీయ వ్యవస్థ భ్రష్టు పట్టడంపై యువత ఆగ్రహంతో ఉంది. మధ్యతరగతి నిస్పృహతో ఉంది. ప్రతి ఒక్కరూ రాజకీయ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలి. అందుకు అనువైన ప్రజాస్వామిక వాతావరణం ఉండాలి. దానికి ఎన్నికల సంస్కరణలు తప్పనిసరి. ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని లేకుండా చేయడం. పార్టీలకు వచ్చిన ఓట్ల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు.

పాక్షిక జాబితాతో కూడిన దామాషా ఎన్నికల విధానం అమలు, అన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు బాధ్యత వహించే విధంగా, చేసిన వాగ్దానాలు అమలు చేసేందుకు ప్రత్యేక చట్టం.

ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించడం. అభ్యర్థులు కానీ, పార్టీలు కానీ ఖర్చు పెట్టకుండా నిషేధం. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ నిధులు ఇవ్వకుండా నిషేధం.

**26. అందరికీ అందుబాటులో న్యాయం :** హైకోర్టును రాష్ట్రానికి తరలించడం.

యువ న్యాయవాదులకు ప్రోత్సాహం.

పారదర్శకతతో న్యాయమూర్తుల నియామకం, రిజర్వేషన్లు అమలు చేయుట.

**27. ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించడం :** ప్రజాస్వామ్య, లౌకిక సంస్కృతి పరిరక్షణ – శాస్త్రీయ భావాల వ్యాప్తి, మూఢ నమ్మకాలకు, అంధ విశ్వాసాలకు, దురాచారాలకు, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా చర్యలు. సమగ్రమైన ప్రజా సాంస్కృతిక విధానం రూపొందించడం. అమలు చేయడం.

ప్రజానురంజకంగా, ప్రజా సంస్కృతిని ప్రోత్సహించేవిధంగా, ప్రజల హక్కులను సాధించుకునే సాధనంగా మీడియా.

జానపద, వృద్ధ కళాకారులకు గౌరవభృతి.

టివి, సినిమాలలో అశ్లీల, అసభ్యకర అంశాల నియంత్రణకు చట్టం

**28. ప్రజల ఆవాసాలుగా పట్టణాలు :** స్మార్ట్‌సిటీల పేరుతో పట్టణాల్లో బడా కార్పోరేట్లకు ప్రత్యేక సౌకర్యాలు, ప్రజలపై పన్నుల భారాలు మోపే విధానం రద్దు. స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధుల కోతతో క్షేత్రస్థాయి ప్రజాస్వామ్యం మృగ్యమవుతోంది. పట్టణాల్లో పౌర సదుపాయాలు ప్రజలందరికీ దక్కాలి. అదనపు భారాలు వేయకుండా ఉండటం. ఇళ్ళు, ఇళ్ళ స్థలాల సమస్యల్ని విధిగా నిర్దిష్ట గడువులో పూర్తిచేయడం. కాలుష్యాన్ని నివారించడం. ప్రజా రవాణాను అభివృద్ధి చేయాలి. సంఘ వ్యతిరేక శక్తులకు పట్టణాలు నిలయాలుగా మారకుండా చూడడం. చిట్టీలు, ఫైనాన్సు వ్యాపారాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టడం, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం.

**29. గ్రామీణాభివృద్ధి :** వేలకొద్ది గ్రామాలు నాగరిక సమాజ అభివృద్ధికి ఆమడ దూరంలో వున్నాయి. కనీస వసతులు, సౌకర్యాలు కూడా లేవు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల్లో, ఆదివాసీ, అటవీ ప్రాంతాల్లో ఈ దుస్థితి ఉంది. ఇక్కడ అక్షరాస్యత తక్కువ, వైద్య సౌకర్యాలు మృగ్యం, రవాణా సౌకర్యాలు లేవు. ఇలాంటి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి ప్రత్యేక పథకాలు రూపొందించడం.

**30. పర్యావరణ పరిరక్షణ :** అభివృద్ధి పేరుతో ప్రజల ప్రాణాలను హరించే పరిశ్రమలను జనావాసాల మధ్య లేకుండా చేయడం. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత. ఆక్వా కాలుష్యాన్ని నివారించడం. విద్యార్థి దశనుండే పర్యావరణంపై అవగాహన పెంచడం.

**31. సైన్స్ & టెక్నాలజీ :** ఆధునిక టెక్నాలజీ పేరుతో ఉద్యోగులపై అదనపు భారం మోపి, నిరుద్యోగాన్ని పెంచే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయి. ఐ.టి.లో నిరుద్యోగం పెరుగుతోంది. డిజిటల్ సేవల పేరుతో క్యాష్‌లెస్ ఎకానమీ, భూరికార్డుల తారుమారు, రేషన్ ఇవ్వకపోవడం వంటి అనేక సమస్యలు ప్రజలెదుర్కొంటున్నారు. ఆధార్ సమాచారం బహిరంగంగా వెల్లడవ్వడంతో పౌరుల ప్రైవసీకి దెబ్బతగిలింది. స్థూలంగా నేటి టెక్నాలజీ కార్పొరేట్ ప్రయోజనాలను నెరవేరుస్తోంది. దీనికి భిన్నంగా ప్రజల ప్రయోజనాలను కాపాడడం, అభివృద్ధి చేయడం, శ్రమ తగ్గించడం, సౌకర్యాలు మెరుగుపర్చడం, భారాలు తగ్గించడం, ఉపాధి పెంచడం లాంటి సానుకూల ప్రయోజనాలు చేకూరేలా చర్యలు తీసుకోవడం. ప్రతి గ్రామానికి ఉచిత వైఫై సౌకర్యం.

***రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయ సాధన, ప్రజా సంక్షేమం, ఉద్యోగం–ఉపాధి కల్పించడం ద్వారా యువత ఉజ్జ్వల భవిష్యత్తు, మహిళా సాధికారిత సాధించేందుకు సిపిఐ(ఎం), సిపిఐ, జనసేన, బిఎస్‌పి పార్టీలను గెలిపిద్దాం!***

***నీతివంతమైన పాలనకు ఓటు వేద్దాం***

***మన నియోజక వర్గ అభివృద్ధికి మనమే కర్తలమవుదాం!!***




*సుత్తికొడవలి నక్షత్రం*



*కంకి కొడవలి*



*గాజుగ్లాసు*



*ఏనుగు*